# మరో మాజీల గొడవ

## భండారు పర్వతాలరావు


'మాజీ' అంటే కుర్చీ దిగిపోయిన దొరబాబని అందరకూ తెలిసిన సంగతే. కాని 'మజీ' మాత్రం ఆ 'మజీ' కాదు సుమండీ!

'పలుకు పలు విధాలు' అన్నారు తమ బోటి పెద్దలు. కొందరు మాట్లాడితే వీణ మీటినట్లుంటుంది. కోయిల కూసినట్లుంటుంది. పలుకులలో తేనె లొలికిపోతాయి. మరి కొంద రుంటారు గార్దభస్వరులు. ఒక్కొక్కళ్ళు మాట్లాడితే డబ్బాలో రాళ్ళు గలబరించి పోస్తున్నట్లుగా ఉంటుంది. లేదా కట్టె విరిచిన ట్లనిపిస్తుంది. ఇక మన దేవుళ్ళ సంగతికి వస్తే అంతా 'మేఘ గంభీర నిస్వను లే' మరి. అంటే ఏమిటో నాకూ తెలియదు నిజం చెప్పాలంటే. అదేమిటి! అట్లా ఉరుముతున్నారు? అప్రస్తుత ప్రశంస ఎందుకనా! మీరూ మేఘ గంభీర నిస్వనులేనని నా కర్థమయిందిగానీండి, ఒక్క క్షణం తాళితే మనవి చేస్తాను మాజీల సంగతి.

పలుకుపలువిధాలు-మాట్లాడే తీరును బట్టే కాక, మాట తీరును బట్టికూడా. అన్ని వేళ్ళూ ఒక్కలా ఉండనట్లే, అందరూ ఒక రకంగా ఉండరుగదా! అయినా అందరు మాట్లాడే తీరూ ఒకే రకంగా ఉండాలని ఓ గొప్ప మతలబు పెట్టేశారు మన పెద్దలు:

"సత్యం బ్రూయాత్
 ప్రియం బ్రూయాత్
న బ్రూయాత్
 సత్యమప్రియం
ప్రియంచ
 నానృతం బ్రూయాత్
ఏషధర్మ
 సనాతనః"

సత్యమే చెప్పాలట. ప్రియం చెప్పాలట. సత్యమే కదా అని అప్రియం చెప్పకూడదట. కూరలో ఉప్పెక్కువయింది సత్యమే. ఆ మాట పైకంటే అర్ధాంగికి అప్రియమేకదా! అందుచే



త నొర్మూనుకుని భోంచేయాలి (నోర్మూనుకుని ఎలా తినటం లాంటి చొప్పదంటు ప్రశ్నలడక్కండా) కాదూ, కూడదని పైకనేశా రనుకోండి-ఓ వారం రోజుల పాటన్నా ఉప్పులేని చప్పటి కూరలు తినక తప్పదు.

అలాగే ప్రియం కదా అని అసత్యం చెప్పరాదట. సుత్తిమతులకు,స్తుతిమతులకు ఇంతకంటే అశనిపాతం ఉంటుందా? వచ్చేనెలలో తప్పక పట్టుచీర కొని పెడతానని ఒట్టువేసి పడకటింటిలో వెన్నెల వెలుగులు నింపుకోటానికి, 'ఆకాశం దించాలా, నెలవంక తుంచాలా, సిగలో ఉంచాలా-అంటూ డ్యూయెట్లు పాడటానికి ఈ రూ లడ్డొస్తుంది. ఓట్ల తిరునాళ్ళలో జనానికి అరచేతిలో వైకుంఠం చూపించి అయిదేళ్ళదాకా అధికార పీఠాలను ఆక్రమించేసుకోడానికీ అంతే! అయితే ఈ మతలబులన్నీ అమలుకాని వర కట్న నిషేధ చట్టంలా అటక మీద నిద్దరో తుంటాయి గనక ఎవరికీ బెంగక్కరలేదు.

ఆ విధంగా పలుకులన్నీ ఒకే మూ సలోకి లాగాలని మనువుగారు చేసిన మతలబు సాగలేదు గనక పలుకు పలు విధా లయినట్లే పలికేవారు పలు విధా లయినా రండీ! ఎలాగంటారా! కాస్త ఆగండి! కట్ మజీ వస్తున్నాడు. పలుకరిస్తాను. కాస్త దూరంగా నిలబడి గమనిస్తుండండి, ఏం జరుగుతుందో...

"నమస్కారం! కట్ మజీ."

"ఎవరూ! కనబడి చావటల్లా! ఇలా దగ్గరకు తగలడు!"

"నేనేనండి!"

"నేనే, నేనే నని కాలిరిగిన కోడిపిల్లలా అరవకపోతే పేరు చెప్పి చావరాదూ!"

"పొరపాటున కదిలించా, సెలవు."

"అఘోరించు."

ఇలా కటువుగా మాట్లాడే వారిని క్లుప్తంగా, గౌరవంగా 'కట్. మా జీ' (గారు) అంటాం. కట్ మజీ క్లబ్బుకు నాటికీ, నేటికీ అధ్యక్షుడు అగ్నిహోత్రావధానులే. ఆయన ఆశీర్వచనం-'నీ ఇంట కోడి కాల్చా'అన్నది ఆ క్లబ్బుకు జాతీయ నినాదం.

కటువుగా పలకకపోయినా కారం రాచినట్లు మాట్లాడే వారిని కా. మా జీ లంటారు. ఆ వచ్చే అత్తమ్మను కదిలిద్దాం:

"కోడలు పిల్ల వచ్చినతర్వాత పనీ అదీ అందుకుంటూ చేతిక్రింద..."

"లేకేమమ్మా! ఆవిడ స్నానాలూ, జడలూ, ముస్తాబులూ- అయ్యో! అన్నీ పనులేగా అందుకుంటూనే ఉంది."

ఇక కోడలమ్మ. . .

"అత్తగా రున్నారమ్మా. .."

"వారు లేకుండా ఎలాగండీ జగత్తు నడిచేది. . ."

"అవును, మంచిమనిషి..."

"మరే!కాదని బతకటమే."

కామజీలనే పుల్లవిరుపు మాటల వారని, లేక 'పుల్.మాజీ'లనికూడా అంటారు.

పోతే కోమజీ పరిచయం కాని వాళ్ళుండరు. అడుగో! దయ చేస్తున్నాడు,ఇటే!తట్టుకోండి.

"ఏవండోయ్! ఇక్కడున్నారేమిటి! సర్వీసు కమీషన్‌లో ఏవయినా పనా ? మొగమాట పడకండి.చెప్పేయండి! మెంబరంతా మన క్లాసుమేట్లే గదా! కాకపోతే సి.ఎమ్.తో చెప్పించనా! మనవాడేగా.రండి! కాఫీ తాగొద్దాం. ఈ హొటల్ ప్రొప్రయిటర్‌కు మనమంటే తగని ఇది లెండి! కిందటిసారి. . .



ఎక్సూజ్‌మి మళ్ళీ కలుస్తా.మినిస్టర్ బామ్మర్ది పిలుస్తున్నాడు. . ." ఇలా సొరకాయలు కోస్తూ మాట్లాడేవారిని సొకోమజీలు,లేకకోమజీలంటారు. వీరనే స్వకుమలనీ అంటే స్వకుచమర్దనులనీ అంటారు.

అన్నట్లు బొట్టు పెట్టుకొచ్చారా,లేదా! కాస్త మట్టో మసో తీసుకుని మొహాన రాసుకోండి!ఏంలేదు దిమజీ వస్తున్నది:

"మీ చంటాడు ఇప్పుడు బాగున్నాడండీ పండాలె,గుండాలె ఒళ్ళు చేసి. అన్నట్టు మీ పెద్దాడు ఫస్టున పాసయ్యాట్టగా! అరె! అది మీ పొట్లపాదే. ఆ మధ్య మీరేదో తవ్వుతుంటే చూశా.అప్పుడే ఎంతయిందీ,బారెడు బారెడు కాయలు సందు లేకుండా చూడ ముచ్చటగా ఉంది. మా ఇంట్లో పాడయిపోయింది పాదు చీడపట్టి. ఎందుకయినా మంచిది,ఓ దిష్టి పిడత తగిలించండి. పాడు కళ్ళు,దిష్టి కళ్ళుంటాయి. మరిచా. నా మతిమండా.ఓ గిన్నె కాఫీపొడి. . ." దిష్టిమాటలవారే దిమజీలు. కా సేపు వీరి మాటలు వింటే దృష్టి దోషాలు నమ్మనివారుకూడా దిష్టి తగిలి దిమ్మెరపోతారు.

కొంతమంది మాట్లాడుతుంటే- ముఖ్యంగా సభల్లో, క్లాసురూముల్లో- అని మిషలుకూడా కునుకుతారు, జోకొట్టినట్లు. ఈ లాలి మాటల లామజీలు సెన్సనీ,ఆర్ట నీ,తెలుగనీ, హిందీఅనీ,ఇంగ్లీషనీ లేకుండా అన్ని క్లాసుల లోను, అధికార సమావేశాల్లోను, శాసనసభా సమావేశాల్లోను, బహిరంగ సభల్లోను తగులుతుంటారు. పెకింగ్- ఇప్పుడు పాజింగ్ అంటు

న్నారో,ఏమంటున్నారో మరి లామాలందర్నీ బయటికి పంపింది పంచన్‌లామను,లా.మ.జీలను తప్ప.

లామాజీల నగోత్రీకులే తామజీ,సామజీలు. తామజీలు చాలా తాపీగా మట్లాడతారుఅర గంట కో మాట కాకి రెట్ట వేసినట్లు.

"ఇదే నా రావటం. . ." ?

". . ."

"అక్కడంతా కులాసా. . . ?"

". . . "చిరునవ్వు. (అమ్మయ్య, బతికించాడు. అంతా కులాసాయేనన్నమాట!"

"పిల్లలంతా పాసయ్యారా ?"

"పెద్దాడు. . . "(తప్పాడా,పాసయ్యాడా. . . తేల్చండి, స్వామీ!న స్పెన్సుతో చంపక).

కాఫీ తాగుతూ. . ."పెద్దాడు... "

వీళ్ళనే నాన్చుడు స్వాములనీ అంటారు.

వీ రిటు చివరయితే, సామజీ లటు చివర. సాగదీసి,సాగదీసి చెప్పిన మాటలే మళ్ళీ మళ్ళీ చెబుతూ నశేష నవలారాజాల్లా మనల్ని సాగ (చావ) గొట్టేస్తారుసాగుడుమాటలవారు. వీరనే దీర్ఘసుత్తులని వ్యవహరిస్తుంటాం.

విన్నా,మట్లాడుకున్నా కొంచెం హాయిగా ఉండేది హాస్యపు మాటల హామజీల దగ్గరే.

"అన్నం రెల్లుతున్నారేం ?"

"వడదెబ్బ తగిలింది."

"ఏం,అబ్బురమండీ! శీతాకాలపు పొద్దుట...'

"మా స్నేహితుడింటికి వెళ్ళాగా వేడి,వేడి వడలు తగిలించాడు. మిత్రుడు నరదా పడుతున్నాడని నాలుగు అదనంగా లాగించా!"

"ఎందు కా నవ్వు ?"

"నువ్వు నవ్వుతుంటే. . . "

"నే న్నవ్వితే మీరు నవ్వాల్నా ?"

"లేదు!కాని ఏడి స్తే కంగారు వడతావని. . "

ఇలా వాళ్ళిద్దరి మధ్య ఎడతెగని చతురోక్తుల జాలు.

అనుకోకుండా హాస్యం పుట్టించే మాటలు చెప్పేవారు 'అహామజీ'లు.

"ఏం సినిమాఆడుతున్నది,ఇందులో. . . "

"అండర్ రిపెయిర్స్. . . "


"ఇంగ్లీషా ?బాగుంటందా ?"

ఒక పెద్దమనిషి అమెరికా వెళుతున్నాడు అక్కడొక పెద్ద నభలో మాట్లాడటానికి.మిత్రుడు నలహా ఇచ్చాడు"వాషింగ్టన్ గురించికూడా మీరు నాలుగు మాటలు చెబితే బాగుంటుంది."

"ఎందుకూ!నా ప్రోగ్రామ్‌లో వాషింగ్టన్ లేదు."

హామజీలకు, అహామజీలకు తెలుగునాట. కొరత లేదని జనశ్రుతి.

మాటలతో హాయిని పంచి, మంచిని పొందే తేనె మాటల వారిని తేమజీ లంటారు. వీరు అసలు తేనె మాటలవారు- ఆతేమజీలని నకలు తేనె మాటలవారని నతేమజీలని రెండు రకాలు. నతేమజీలను తేనె పూసిన కత్తులని మాయమాటలవారు లేక మామజీలని అంటారు. మామజీ క్లబ్బుకు మొదట శకుని అధ్యక్షుడుగా ఉండేవాడట. గిరీశాలు,రాజకీయ గిరీశాలు వచ్చి ఆయన్ను 'టాపుల్' చేశారు. ప్రస్తుతం ఏ క్షణాన ఎవ డధ్యక్షు డవుతాడో తేలనంత వేగంగా మారిపోతున్నారు. అధ్యక్షపదవి కోసం వారి పాట్లు చూస్తుంటే మధురవాణి ఇంట మంచం కింద దూరిన గిరీశం,రామప్పంతులూ గుర్తుకు వస్తారు. ఇప్పటికీ రాజకీయ మధురవాణుల మంచాల కింద పోలీసు అప్పారావులు వాళ్ళ కోసం వెతుకుతూనే ఉన్నార్ట!



తేనె మాటల వారిలో ముఖ్యులు ఇన్సూరెన్సువాళ్ళు.వీరి వృత్తిలో కట్‌మజీలు,కామజీలు పనికిరారు. అసలు సంగతి చెప్పకుండా .అలా అని ఏమీ దాయకుండా చెప్పి,మెప్పించి, ఒప్పించి, పాలిసీ ఇప్పించి ప్రీమియం కక్కించటం మహా గొప్ప ఒడుపు. పట్టు జారటానికి జిడ్డు పట్టిస్తారు దొంగలు. జిడ్డులా పట్టి ఉడుంపట్టును మించుతారు ఈ దొరలు. వాళ్ళు చెప్పేదాని సారం ఇలా ఉంటుంది:

"నీవు ఎప్పుడో ఒకప్పుడు చావక తప్పదు. రేపే చస్తావో,ఇవాళే చస్తావో ఎవడెరుగు?నువ్వు చస్తే నీ పెళ్ళాం, పిల్లలు బజార్న పడి అడుక్కు తినాల్సి ందేగదా! ఆ చచ్చేదేదో ఇన్సూరెన్సు చేసి చస్తే వాళ్ళకు భద్రత. బతికున్నావా బలుసాకు తినక్కరలేదు. మెచ్యూర్ అయిన పాలిసీ మొత్తం తిని రాజాలా గడుపు."

ఇలా చెబితే బిజినెస్ రాదుగదా, "అప్రాచ్యపు వెధవా! పొద్దుటే దాపురించి అమంగళం పలుకుతావా!"అంటూ అగ్నిహోత్రావధానుల మక్కు అక్షింతలు చల్లిఆపైన మక్కె లిరగదీస్తాడు. అదే భావాన్ని తేనాజీలు వచ్చి మనకు తీయటి పటిక బెల్లపు పలుకులలో చెప్పి, పచ్చని చెట్టు చూపించి నొప్పి లేకుండా కాలిముల్లు తీసినట్లు మనింట్లో టీ తాగి, మన పైకం పుచ్చుకుని మనతో థాంక్స్ చెప్పించుకుని. . . ఏం చెప్పనుఆ తేమజీల ఘనత!

కొంతమంది పుట్టుకతోనే తేనెమాటలతో పుడతారు. అమృతంలో భావన చేసిన అధరాలు తగిలించుకున్న ఏ అందమైన నర్సో వాళ్ళు పుట్టగానే వాళ్ళ నోరు ఎంగిలి చేస్తూ ముద్దెట్టుకుని ఉంటుంది, సందేహం లేదు. వీరిని ఉత్తమ తేనే మాటలవారని, ఉతేమజీలని అనవచ్చు. వీరు ప్రియంగా మట్లాడతారు. కాని అందుకోసం అసత్యం పలకరు. అవసరమయినంతవరకు సత్యాన్ని నవరిస్తారు, లేక దాస్తారు.

మనం:"ఆ అబ్బాయి చూడండి! బానంత బొర్రా అదీ!"

ఉతేమజీ:"కుర్రాడికేం- నిక్షేపంలా ఉన్నాడు కాస్త బొద్దు! అంతే!"

మనం:"ఆ రంభను చూడండి. ఎవడితో చూసినా అదే".

ఉతేమజీ:"అవును,కాస్త సోషల్ -ముఖ్యంగా సోమయాజులతో."

మనం:"ఆ అనూరుడిగాణ్ణి చూశారా!ఒంటి కాలి వెధవ. . ."

ఉతేమజీ:"నిర్విరామ కృషికి అతన్నే చెప్పుకోవాలి. ప్రతివాడిమీదికీ ఒంటికాలి మీద లేస్తాడనే గాని అజాతశత్రు వనుకోండి!"

మనం:"చప్రాసీల టీలో తగిలించినట్లు చక్కెర పానకం చేశారు కాఫీ,ఛీ!"

ఉతేమజీ:"అమృతం సుమండీ ఒక్కొక్కళ్ళ చెయి తీరే అంత!"

మనం:"వాళ్ళబ్బాయి అలా కోశాడా తా నో బృహస్పతినని.తప్పి కూచున్నాడు".

ఉతేమజీ:"కంప్యూటర్ యుగం. పునాది గట్టి పడుతుంది. ఈసారి ఫస్టున పాసవుతాడు. విజయీ భవ!"

ఇలాంటి చిక్కని, దొరకని ఉతేమజీ ఒక జిల్లాలో కలక్టరుగా వచ్చాడు. పెద్ద అధికారులందరికీ ఓ మీటింగ్ పెట్టాడు. కలక్టర్ పంక్చువల్ అని విని అంతాటైముకే వచ్చారు, లేట్ లతీఫ్ జాయింటు కలక్టరు తప్ప. ఆలస్యంగా వచ్చి కూచుంటున్న జాయింటు కలక్టర్ని చూసి కలక్టరుగారు చిరునవ్వు నవ్వి, "సారీ,! రావ్! మీకన్నా మేం కాస్త ముందొచ్చినట్లున్నాం" అన్నాడట.

అలా సత్యంగా అప్రియం కాకుండా, ప్రియంగా అసత్యం కాకుండా మట్లాడే నేర్పు మనందరం సంతరించుకుంటే ప్రపంచమే సుఖశాంతి నిలయమై, ఇంద్రుడి వేయి కన్నులూ కుట్టేట్లు చేస్తుందేమో! ●